


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




మంగళవారం 20-01-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 224 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## కాకినాడ జిల్లాలో బస్సు ప్రమాదం.. 9 మందికి గాయాలు



2 లో

## "చంద్రబాబు నాయుడు దేశంలోనే గొప్ప నాయకుడు": బండ్ల గణేష్



2 లో

## ఈ రెండేళ్లలో ఏం సాధించారో శ్వేతపత్రం ఇవ్వండి... సీఎం దావోస్ పర్యటనపై కవిత



2 లో

## వధువు కావలెను.. ఆ గ్రామంలో వినూత్న ఫ్లెక్సీ వైరల్!



2 లో

## కొత్త ఏడాదిలో స్క్రబ్ టైఫస్ కేసుల ఆందోళన



2 లో

## స్పీడ్ పెంచిన కాంగ్రెస్.. మున్సిపల్ ఎన్నికలకు ఇన్‌చార్జ్‌ల ప్రకటన



Incharges of Parliament Constituencies Muncipal Elections-2026

| S No | Name of the Minister (Sri/Smt) | Proposed PC Incharge |
|---|---|---|
| 1 | Podduturi Sudarshan Reddy, Advisor to Govt | Adilabad(ST) |
| 2 | Komatireddy Venkat Reddy | Malkajgiri |
| 3 | Duddilla Sridhar Babu | Chevella |
| 4 | Tummala Nageshwar Rao | Karimanagar |
| 5 | Konda Surekha | Khammam |
| 6 | Ponnam Prabhakar | Mahabubabad(ST) |
| 7 | Damodar Rajanarsimha | Mahabubnagar |
| 8 | Mohd Azaruddin | Zaheerabad |
| 9 | Vivek Venkataswamy | Medak |
| 10 | Vakiti Srihari | Nagarkurnool(SC) |
| 11 | Adluri Laxman Kumar | Nalgonda |
| 12 | D Anasuya Seethakka | Bhongiri |
| 13 | N Uttam Kumar Reddy | Nizamabad |
| 14 | Ponguleti Srinivas Reddy | Warangal(SC) |
| 15 | Jupally Krishna Rao | Peddapalli |



2 లో

## తమ్ముడి ప్రాణం కాపాడిన ఎనిమిదేళ్ల చిన్నారి



2 లో

# జి రామ్ జి చట్టంపై రాహుల్, ఖర్గేలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సవాల్



న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భారత ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'వికసిత్ భారత్–గ్రామ్ జీ' చట్టంపై ప్రతిపక్షాలు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వారిది ఒక "అబద్ధాల షాపు" అని ఆయన విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కాంగ్రెస్ ఏఐ ద్వారా సృష్టించిన నకిలీ చిత్రాలను వాడుతోందని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు సరికాదని ఆయన హితవు పలికారు. అలాగే పార్లమెంట్‌లో ఈ చట్టంపై సుదీర్ఘ చర్చ జరిగినప్పుడు రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నారని ఆయన నిలదీశారు.

ఈ కొత్త చట్టం గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు, రైతులకు ఎంతో మేలు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. పాత ఉపాధి హామీ పథకంలో ఉన్న లోపాలను సవరించి, పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడమే కాకుండా, పారదర్శకమైన నిధుల పంపిణీకి ఈ చట్టం హామీ ఇస్తుందని ఆయన వివరించారు. కాంగ్రెస్ చేస్తున్న విమర్శల్లో నిజం లేదని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే వారు 'సంగ్రామ్' వంటి పదాలను వాడుతూ గందరగోళం సృష్టిస్తున్నారని మంత్రి చౌహాన్ విమర్శించారు. అబద్ధాలు ప్రచారం చేయడం ఆపి, వాస్తవాలను గ్రహించి 'వికసిత్ భారత్–గ్రామ్ జీ' చట్టానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలపాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కోరారు.

# పని ఒత్తిడి తట్టుకోలేక సచివాలయ ఉద్యోగిని మృతి




2 లో

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): పని ఒత్తిడి తట్టుకోలేక సచివాలయ ఉద్యోగిని మృతి చెందిన ఘటన కడప నగరంలో జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల నగరంలోని గౌస్ నగర్ కు చెందిన జి.విజయకుమారి (42) సచివాలయంలో హెల్త్ సెక్రటరీగా పని చేస్తున్నారు. జనవరి 17న పాత కడప యూపీహెచ్సీలో విధి నిర్వహణలో ఉన్నారు. ఈ క్రమంలో ఆమెకు ఉన్నతాధికారులు ఫోన్ కాల్ చేశారు. సర్వేలు ఎందుకు చేయడం లేదని.. పై నుంచి చాలా ఒత్తిడి ఉందని.. తప్పకుండా సర్వేలు చేయాల్సిందేనని గదమాయించారని తెలుస్తోంది. పండుగ సమయంలో విధులు నిర్వహిస్తున్నా కూడా ఉన్నతాధికారులు మాట్లాడిన తీరుతో విజయకుమారి ఒత్తిడికి గురైనట్లు కనిపిస్తోంది.

ఇంటికి వచ్చిన తరువాత అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఆమె తన కుమార్తెతో చెప్పింది. ఆదివారం తెల్లవారుజామున శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తుతోందని చెప్పి అలానే ఒరిగిపోయిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తరువాత ఎంతకీ కళ్లను తెరవలేదని అంటున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడి కారణంగానే విజయకుమారి మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

# కల్వకుంట్ల కవిత పార్టీ కోసం రంగంలోకి ప్రశాంత్ కిషోర్?




2 లో

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): గులాబీ బాస్ కల్వకుంట్ల చంద్రశేఖర రావు కూతురు కవిత కొత్త పార్టీ పెట్టే దిశగా అడుగులు వేస్తున్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు ఇప్పటికే ఆమె హింట్ కూడా ఇచ్చారు. గులాబీ పార్టీ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత.. ట్రబుల్ షూటర్ హరీష్ రావును టార్గెట్ చేస్తూ హాట్ కామెంట్స్ చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే, ఇటు గులాబీ పార్టీలో ఉన్న లుకలుకలను బయట పెడుతున్నారు. అటు బీసీల నినాదం ఎత్తుకుని ముందుకు వెళుతున్నారు. ఇక ఇప్పుడు కొత్త పార్టీ వైపు కవిత అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

కవిత పార్టీ కోసం రంగంలోకి ప్రశాంత్ కిషోర్?: అయితే కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేయబోయే పార్టీ కోసం పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిషోర్ రంగంలోకి దిగినట్లు కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే వైసీపీ లాంటి ప్రాంతీయ పార్టీలకు పని చేసిన ప్రశాంత్ కిషోర్.. నెక్స్ట్ కవిత కోసం పనిచేయబోతున్నారట. రెండు నెలల వ్యవధిలోనే కల్వకుంట్ల కవితను హైదరాబాద్ కు వచ్చి పలుమార్లు రహస్యంగా సమావేశం అయ్యారట ప్రశాంత్ కిషోర్. హైదరాబాద్ లోని ఓ ప్రముఖ హోటల్ లో వీళ్ళ సమావేశం జరిగినట్లు కూడా ఓ న్యూస్ బయటకు వచ్చింది. లేటెస్ట్ గా సంక్రాంతి పండుగ సందర్భంగా ఐదు రోజులపాటు ప్రశాంత్ కిషోర్ తో కల్వకుంట్ల కవిత సమావేశం కూడా నిర్వహించారట.

## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా.. మరో మూడు రోజుల్లో నోటిఫికేషన్!




2 లో

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): తెలంగాణలో స్థానిక సంస్థల సమరానికి ముహూర్తం ఖరారైంది. మేడారం సమ్మక్క–సారలమ్మ సాక్షిగా ఆదివారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఫిబ్రవరి నెలలో ఎన్నికలు జరపాలని నిర్ణయిస్తూ ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాసింది. మరో మూడు రోజుల్లోనే అధికారిక ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ భేటీలో జిల్లాల పునర్విభజన వంటి కీలక అంశాలకు కూడా కేబినెట్ ఆమోదం తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ప్రపంచ పెట్టుబడుల వేటలో తెలంగాణ

# దావోస్‌లో సీఎం రేవంత్ స్పెషల్ మిషన్

- దావోస్ వేదికగా తెలంగాణకు కీలక అవకాశం
- భారీ పెట్టుబడులే లక్ష్యంగా రేవంత్ సర్కారు
- ఏఐ రంగంలో హైదరాబాద్‌కు గ్లోబల్ గుర్తింపు లక్ష్యం
- సెమీకండక్టర్‌ఎలక్ట్రానిక్స్‌పై ప్రత్యేక ఫోకస్
- గ్రీన్ ఎనర్జీ, ఈవీ పెట్టుబడులపై దృష్టి
- సీఎం నేతృత్వంలో గ్లోబల్ సీఈవోలతో భేటీలు
- ప్రతిపాదనల నుంచి ఒప్పందాల దాకా వ్యూహం
- ఉద్యోగాలుఆర్థిక వృద్ధికి దావోస్ కీలకం

మిగతా 2 లో

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ):

ప్రపంచ పెట్టుబడులకు కేరాఫ్ అయిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సుకు సర్వం సిద్ధమైంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో నేటి నుంచి ఈ నెల 23వ తేదీ వరకూ ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు జరగనుంది. ఈ వేదిక నుంచి మరోసారి పెట్టుబడులు రాబట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెడీ అయింది. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బృందం గతేడాది దావోస్ వేదికగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులు సాధించిన విషయం తెలిసిందే. ఈ సారి గతం కన్నా ఎక్కువ పెట్టుబడులు రాబట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం దావోస్ టూర్‌కు వెళ్ళింది. ఈ సారి జరిగే టూర్‌ను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ గేట్‌వేగా వినియోగించుకోవాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకుంది.



## అరుదైన ఘనతను సాధించిన అదానీ సోలార్




2 లో

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): దేశీయ అదానీ సోలార్ సంస్థ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచ క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ స్థానాన్ని మెరుగుపరుస్తూ, ప్రముఖ వుడ్ మెకెంజీ ర్యాకింగ్స్‌లో అదానీ సోలార్‌కు చోటు దక్కింది. వుడ్ మెకెంజీ గ్లోబల్ సోలార్ మాడ్యూల్ తయారీ ర్యాంకింగ్‌లో స్థానం సంపాదించిన ఏకైక భారతీయ కంపెనీ అదానీ సోలార్ నిలిచింది.

## 'ఒక్కటి యాది పెట్టుకోండ్రి.. కర్మ ఎవ్వర్నీ ఇడిసిపెట్టదు': సజ్జనార్ సంచలన పోస్ట్



2 లో

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): సోషల్ మీడియా ద్వారా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంటారు సీపీ వీసీ సజ్జనార్. ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ క్రైమ్ మోసాల పై యువతకు అవగాహన కల్పిస్తుంటారు. సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటూ ప్రజల భద్రతే లక్ష్యంగా పోస్టులు పెడుతుంటారు. తాజాగా సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల తీరుపై సీపీ వీసీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అరుదైన ఘనతను సాధించిన అదానీ సోలార్

మొదటి పేజీ తరువాయి

అదానీ న్యూ ఇండస్ట్రీస్‌కు చెందిన అదానీ సోలార్ కు అంతర్జాతీయంగా 8వ ర్యాంకు లభించడమే కాకుండా, గ్రేడ్ ఏ రేటింగ్ లభించింది. నాణ్యత, ఆర్థిక బలం, పనితీరు, విశ్వసనీయత వంటి అంశాల ఆధారంగా కంపెనీకి ఈ గౌరవడం దక్కింది. ఈ జాబితాలో చైనా కంపెనీలు ఇప్పటికీ అగ్రస్థానాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ, అదానీ సోలార్ ఉనికి భారత్?ను ప్రపంచవ్యాప్తంగా మరింత పోటీకి నిలబెట్టింది. గతేడాది మొదటి ఆరునెలలకు సంబంధించి వుడ్ మెకెంజీ తన తాజా నివేదికను విడుదల చేసింది. ఇది సోలార్ ప్యానెల్ కంపెనీలకు సంబంధించిన షిప్?మెంట్?లు, బ్యాంకింగ్, పనితీరును తనిఖీ చేస్తుంది. దాదాపు 38 కంపెనీలను సమీక్షించి వుడ్ మెకెంజీ తన నివేదికను రూపొందించింది. ఇందులో జేఏ సోలార్ 91.7 పాయింట్లు, ట్రినాసోలార్ 91.6 పాయింట్లతో సంయుక్తంగా టాప్ ర్యాంకులో నిలిచాయి. అదానీ సోలార్ 81 పాయింట్లను సాధించింది. అలాగే, గ్రేడ్ ఏ రేటింగ్ ద్వారా కంపెనీ అత్యున్నత పనితీరు, పారదర్శకత ప్రమాణాలను సూచిస్తుంది. కాగా, 2025 నాటికి అదానీ సోలార్ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో 15,000 మెగావాట్ల కంటే ఎక్కువ సౌర మాడ్యూళ్లను రవాణా చేసింది. ఇందులో 10,000 మెగావాట్లు దేశీయంగా, మిగిలిన 5,000 మెగావాట్లు విదేశాలకు ఎగుమతి చేసింది. ఇదే సమయంలో కంపెనీ 8,000 కంటే ఎక్కువ ప్రత్యక్ష ఉద్యోగాలు, భారీగా పరోక్ష ఉద్యోగాలను సృష్టించింది.

# తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా.. మరో మూడు రోజుల్లో నోటిఫికేషన్!

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): తెలంగాణలో స్థానిక సంస్థల సమరానికి ముహూర్తం ఖరారైంది. మేడారం సమ్మక్క–సారలమ్మ సాక్షిగా ఆదివారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఫిబ్రవరి నెలలో ఎన్నికలు జరపాలని నిర్ణయిస్తూ ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాసింది. మరో మూడు రోజుల్లోనే అధికారిక ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ భేటీలో జిల్లాల పునర్విభజన వంటి కీలక అంశాలకు కూడా కేబినెట్ ఆమోదం తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇప్పటికే రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు సంబంధించి మేయర్, చైర్‌పర్సన్ పదవుల రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల సందడి అప్పుడే మొదలైపోయింది. ఆశావహులు టికెట్ల కోసం తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పార్టీ అగ్రనేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పైరవీలకు తెరలేపారు. అటు గడువు ముగిసిన మున్సిపాలిటీల్లో అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు అటు అధికార కాంగ్రెస్, ఇటు ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి.

# 'ఒక్కటి యాది పెట్టుకోండ్రి.. కర్మ ఎవ్వర్నీ ఇడిసిపెట్టదు': సజ్జనార్ సంచలన పోస్ట్

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): సోషల్ మీడియా ద్వారా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంటారు సీపీ వీసీ సజ్జనార్. ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ క్రైమ్ మోసాల పై యువతకు అవగాహన కల్పిస్తుంటారు. సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటూ ప్రజల భద్రతే లక్ష్యంగా పోస్టులు పెడుతుంటారు. తాజాగా సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల తీరుపై సీపీ వీసీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం డబ్బు కోసం లక్కీ డ్రాల పేరుతో ప్రజలను మోసం చేయవద్దని, నమ్మిన వారిని వంచించడం తగదని హితవు పలికారు.

"మిమ్మల్ని నమ్మి జనాలు ఫాలో అవుతున్నారంటే.. ఏదన్నా మంచి కంటెంట్ చేయండి. అంతేగాని, పైసల కోసం జనాన్ని మాత్రం దోచుకోకండ్రి! ఒక్కటి యాది పెట్టుకోండ్రి.. కర్మ ఎవ్వర్నీ ఇడిసి పెట్టదు. అది ఎక్కడికో ఎత్తుకపోయి, మల్లా గొయ్యి తీసి పూడ్చేస్తది! చేసేది మోసం అని మీ మనసుకి తెలుసు కదా? చట్టాన్ని లైట్ తీసుకుంటే చివరకు నష్టపోతారు" అని సజ్జనార్ ట్విట్టర్ వేదికగా హెచ్చరించారు. అలాగే తప్పుడు ప్రకటన పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# కాకినాడ జిల్లాలో బస్సు ప్రమాదం.. 9 మందికి గాయాలు



న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలు వద్ద ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సుకు ప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి శ్రీకాకుళం నుంచి భీమవరం బయలుదేరిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కాకినాడ జిల్లా చేబ్రోలు గ్రామం సత్తెమ్మ తల్లి ఆలయం వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 9మంది గాయపడ్డారు. వీరిని స్థానికులు హుటాహుటిన పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఎవరికీ పెద్దగా గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.35 మంది ప్రయాణికులతో బస్సు శ్రీకాకుళం నుంచి భీమవరం బయలుదేరింది. మార్గం మధ్యలో బస్సు బోల్తాపడటంతో అంతా ఆందోళన గురయ్యారు. పండగ సెలవులు పూర్తి కావడంతో ఎవరి ఇళ్లకు వారు బయలుదేరే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణంగా పలువురు ఆరోపిస్తున్నారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికులను వేరే బస్సులో సురక్షితంగా పంపించారు.

# పని ఒత్తిడి తట్టుకోలేక సచివాలయ ఉద్యోగిని మృతి



పని ఒత్తిడి తట్టుకోలేక సచివాలయ ఉద్యోగిని మృతి చెందిన ఘటన కడప నగరంలో జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల నగరంలోని గౌస్ నగర్ కు చెందిన జి.విజయకుమారి (42) సచివాలయంలో హెల్త్ సెక్రటరీగా పని చేస్తున్నారు. జనవరి 17న పాత కడప యూపీహెచ్సీలో విధి నిర్వహణలో ఉన్నారు. ఈ క్రమంలో ఆమెకు ఉన్నతాధికారులు ఫోన్ కాల్ చేశారు. సర్వేలు ఎందుకు చేయడం లేదని.. పై నుంచి చాలా ఒత్తిడి ఉందని.. తప్పకుండా సర్వేలు చేయాల్సిందేనని గదమాయించారని తెలుస్తోంది. పండుగ సమయంలో విధులు నిర్వహిస్తున్నా కూడా ఉన్నతాధికారులు మాట్లాడిన తీరుతో విజయకుమారి ఒత్తిడికి గురైనట్లు కనిపిస్తోంది.

ఇంటికి వచ్చిన తరువాత అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఆమె తన కుమార్తెతో చెప్పింది. ఆదివారం తెల్లవారుజామున శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తుతోందని చెప్పి అలానే ఒరిగిపోయిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తరువాత ఎంతకీ కళ్లను తెరవలేదని అంటున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడి కారణంగానే విజయకుమారి మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

విషయం తెలుసుకున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు బాధితురాలు ఇంటికి చేరుకొని నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ అధికారుల ఒత్తిడి భరించలేక సచివాలయ ఉద్యోగులు చనిపోతున్నారని ఆరోపించారు. గతంలో ఒక సచివాలయానికి 10 మంది సిబ్బందితో పాటు, 20 మంది వలంటీర్లు ఉండేవారని పేర్కొంటున్నారు. ఇప్పుడు కేవలం ఐదుగురికే సంఖ్య పరిమితమైందని వాపోతున్నారు. దీనివల్ల తమపై ఒత్తిడి పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రపంచ పెట్టుబడుల వేటలో తెలంగాణ.. దావోస్‌లో సీఎం రేవంత్ స్పెషల్ మిషన్

మొదటి పేజీ తరువాయి

**దావోస్‌కు ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం:** దావోస్‌లో జరిగే సదస్సు ప్రపంచ దేశాల ప్రభుత్వాలు, కార్పొరేట్ దిగ్గజాలు, ఆర్థిక సంస్థలు, టెక్నాలజీ నాయకులు, విధాన రూపకర్తలు కలిసే అత్యంత ప్రభావవంతమైన వేదిక. పెట్టుబడుల ఒప్పందాలు, భాగస్వామ్యాలు, భవిష్యత్ ఆర్థిక వ్యూహాలపై ఇక్కడ చర్చలు జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం సైతం రెండు పర్యటనల్లో ఈ వేదికను సమర్థవంతంగా వినియోగించుకుని రాష్ట్రాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా నిలబెట్టింది. ఈ ఎక్స్‌పీరియన్స్‌తో మూడో పర్యటనను మరింత వ్యూహాత్మకంగా ప్లాన్ చేసింది. ఈ సారి రాష్ట్ర ప్రభుత్వం ఏఐ నుంచి గ్రీన్ ఎనర్జీ వరకు బహుముఖ ఎజెండాతో సాధారణ ప్రెజెంటేషన్‌తో కాకుండా రంగాలవారీగా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్లేందుకు ప్రిపేర్ అయ్యింది.

**నాలుగు కీలక రంగాలపై ఫోకస్:** దావోస్ సదస్సు నేపథ్యంలో రాష్ట్రంలోని రేవంత్ సర్కారు ప్రధానంగా నాలుగు కీలక రంగాలపై ఫోకస్ పెట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో హైదరాబాద్‌ను దేశంలోనే ప్రముఖ ఏఐ హబ్‌గా నిలబెట్టే దిశగా గ్లోబల్ టెక్ సంస్థల ఆర్‌అండ్‌డీ కేంద్రాలు, డేటా సెంటర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నది. సెమీకండక్టర్–ఎలక్ట్రానిక్స్ రంగంలో చిప్ డిజైన్ సెంటర్లు, ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు, సప్లై చైన్ భాగస్వామ్యాలపై ప్రత్యేక చర్చలు జరుపనుంది. భారత సెమీకండక్టర్ ఎకో సిస్టమ్‌లో తెలంగాణను కీలక కేంద్రంగా మార్చాలన్నదే ప్రభుత్వ ఆశయమని చాలా సందర్భాల్లో సర్కారు వెల్లడించింది. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ వేదికగానూ ఇదే అంశాన్ని ప్రకటించింది.

అదే విధంగా గ్రీన్ ఎనర్జీ అండ్ ఈవీ రంగంలో సోలార్, విండ్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, ఎలక్ట్రిక్ వెహికల్ తయారీ యూనిట్లు, బ్యాటరీ ప్లాంట్లు, చార్జింగ్ మౌలిక సదుపాయాలపై ఒప్పందాలు చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. స్టార్టప్ ఎకో సిస్టమ్ రంగంలో అంతర్జాతీయ వెంచర్ క్యాపిటల్ సంస్థలు, గ్లోబల్ యాక్సిలరేటర్లు, టెక్ ఇంక్యుబేటర్లతో భాగస్వామ్యాలు ఏర్పరచి తెలంగాణ స్టార్టప్ లకు ప్రపంచ వేదిక కల్పించేందుకు చర్యలు చేపడుతున్నది. ఫార్మా–లైఫ్ సైన్సెస్ రంగంలో బయోటెక్ పరిశోధనా కేంద్రాలు, డ్రగ్ రీసెర్చ్ ల్యాబ్స్, మెడికల్ ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటు దిశగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం దావోస్ పర్యటనకు వెళ్లనున్నది.

**సీఎం ఆధ్వర్యంలో హై ప్రొఫైల్ మీటింగ్స్:** అంతర్జాతీయ స్థాయిలో కంపెనీల దృష్టిని తెలంగాణ వైపు మరల్చేలా ప్రభుత్వం దావోస్ వేదికగా చర్యలు తీసుకోనుంది. ఇందుకు సీఎం రేవంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రెజెంటేషన్ ఇవ్వనుంది. తెలంగాణ గేట్‌వే టూ ఇండియాస్ ఫ్యూచర్ ఎకానమీ అంశాన్ని థీమ్‌గా ఎంచుకున్నది. ఈ ప్రెజెంటేషన్‌లో హైదరాబాద్ ఐటీ విజయగాథ, ఫార్మా క్యాపిటల్‌గా రాష్ట్ర స్థానం, మౌలిక సదుపాయాల పురోగతి, పరిశ్రమలకు సులభమైన అనుమతులు, పెట్టుబడిదారులకు పారదర్శక విధానాలను అందించడంపై వివరించనున్నారు. సీఎం నేతృత్వంలో ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం దావోస్‌లో వరుసగా గ్లోబల్ సీఈవోలు, బహుళజాతి కంపెనీల ప్రతినిధులు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో ముఖాముఖి భేటీలు నిర్వహించనుంది. కొన్ని కీలక కంపెనీలతో ముందస్తు సమావేశాలు నిర్వహించేందుకు ఇప్పటికే షెడ్యూల్ కంప్లీట్ అయినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

గత రెండు దావోస్ పర్యటనల్లోనూ రాష్ట్రానికి భారీ పెట్టుబడి ప్రతిపాదనలు సాధించారు. దీంతో రాష్ట్రానికి ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీ స్టేట్ అనే ఇమేజ్ లభించింది. ఈసారి వాటిని ఒప్పందాలుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తుంది. గత అనుభవాల ఆధారంగా ఈసారి ప్రభుత్వం మూడు ప్రధాన వ్యూహాలను అమలు చేయనున్నట్లు తెలిసింది. రెడీ ప్రాజెక్ట్ జాబితాలో భాగంగా ఖాళీ ప్రతిపాదనలు కాకుండా అమలుకు సిద్ధమైన ప్రాజెక్టులతో వెళ్లడం, ఫాలోఅప్ మెకానిజంలో భాగంగా దావోస్ తర్వాత ఒప్పందాల అమలుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, ఫాస్ట్‌ట్రాక్ అనుమతులు ఇవ్వడంలో భాగంగా పెట్టుబడులకు వేగవంతమైన క్లియరెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

**భవిష్యత్ ఆర్థిక వ్యూహానికి కీలకం:** దావోస్ పర్యటన ద్వారా భారీ విదేశీ పెట్టుబడులు, రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపన, వేలాది ఉద్యోగాల ఏర్పాటు, ఎగుమతుల పెరుగుదల, టెక్నాలజీ ఆధారిత ఆర్థిక వృద్ధి జరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తున్నది. మరోవైపు.. దావోస్ పర్యటనను భవిష్యత్ ఆర్థిక వ్యూహానికి కీలకంగా భావిస్తోంది. మొత్తానికి సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో మరోసారి తెలంగాణ సత్తా చాటేలా దావోస్ పర్యటనను దిగ్విజయం చేయాలనే సంకల్పంతో వెళ్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా.. రాష్ట్రానికి ఇతర దేశాలతోని పోటీ అని పదే పదే ప్రభుత్వ పెద్దలు చెబుతూ వస్తున్నారు. దానికి అనుగుణంగా మరిన్ని ఇంటర్నేషనల్ కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చి వరల్డ్ వైడ్ తెలంగాణ పేరు చాటిచెప్పాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది.

# "చంద్రబాబు నాయుడు దేశంలోనే గొప్ప నాయకుడు": బండ్ల గణేష్

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): ప్రముఖ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ తాజాగా ఓ న్యూస్ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై తనకున్న అభిమానాన్ని చాటుకుంటూ ఆయన పాదయాత్రను ప్రారంభించారు. ఈ దేశంలోనే అత్యంత గొప్ప నాయకుల్లో సీఎం చంద్రబాబు ఒకరని ఈ సందర్భంగా బండ్ల గణేష్ కొనియాడారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అరెస్ట్ అయిన సమయంలో తాను ఎంతో మానసిక వేదనకు గురయ్యానని తెలిపారు. ఆ సమయంలోనే చంద్రబాబు జైలు నుంచి సురక్షితంగా బయటకు వస్తే.. కాలినడకన తిరుమలలోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటానని మొక్కుకున్నట్లు వెల్లడించారు.

తను మొక్కుకున్న నాలుగు రోజులకే చంద్రబాబుకు బెయిల్ రావడం, ఇటీవలే ఆ కేసులను న్యాయస్థానం పూర్తిగా కొట్టేయడంతో తన సంకల్పం నెరవేరిందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే స్వామివారికి మొక్కు తీర్చుకోవడానికి 'సంకల్ప యాత్ర' పేరుతో పాదయాత్ర చేపట్టారు. సుమారు 20 రోజుల్లో తిరుమలకు తన పాదయాత్ర పూర్తవుతుందని, చంద్రబాబు క్షేమంగా ఉండాలని కోరుకుంటూ ఈ యాత్ర చేస్తున్నానని బండ్ల గణేష్ వివరించారు.

# ఈ రెండేళ్లలో ఏం సాధించారో శ్వేతపత్రం ఇవ్వండి సీఎం దావోస్ పర్యటనపై కవిత

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ( నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం ఇవాళ స్విట్జర్లాండ్ లోని దావోస్ పర్యటనకు బయలుదేరింది. అక్కడ ఈనెల 23 వరకు జరగబోయే వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్)–2026 సదస్సులో సీఎం బృందం పాల్గొననుంది. అయితే సీఎం దావోస్ పర్యటనపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శలు గుప్పించారు. 'ఎక్కే విమానం – దిగే విమానం అన్నట్లుగా సీఎం దావోస్ ట్రిప్ ఉందని విమర్శించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడుల ప్రచారం తప్ప రెండేళ్లలో తెలంగాణకు మీరు తెచ్చిందేమిటి అని సీఎంను ఇవాళ ఎక్స్ వేదికగా కవిత ప్రశ్నించారు. 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.40,232 కోట్లు, 2025లో రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమ్మిట్‌లో వచ్చినట్టు మీరు, మీ ప్రభుత్వం ప్రచారం చేసుకున్నది. మొన్నటికి మొన్న కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు ఊదరగొట్టారు. దావోస్ సమ్మిట్‌లు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో చేసుకున్న ఎంవోయూలలో ఎన్ని పరిశ్రమలు గ్రౌండ్ అయ్యాయి? ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# వధువు కావలెను.. ఆ గ్రామంలో వినూత్న ఫ్లెక్సీ వైరల్!

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక వింతలు, విశేషాలకు కొదువ లేకుండా పోయింది. ప్రపంచంలో ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగిన క్షణాల్లో వైరల్ అవుతుంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని ఓ గ్రామంలో వెలిసిన ఫ్లెక్సీ నెట్టింట చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. పెళ్లి సంబంధాల కోసం ఈ కాలం యువకులు వినూత్న దారి ఎంచుకున్నారు. చిత్తూరు జిల్లా ఐరాల మండలం కలికిరిపల్లెలో పశువుల పండుగ సందర్భంగా యువకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కొందరు యువకుల ఫొటోలపై స్టార్ గుర్తులు వేసి ఆ ఫ్లెక్సీలో ముఖ్య గమనిక అంటూ.. "స్టార్ గుర్తు కలిగిన యువకులకు వధువు కావాలి" అని ముద్రించారు. దీన్ని చూసిన వారు ఆశ్చర్యానికి గురయ్యారు. అందరూ ఈ వెరైటీ ప్రచారాన్ని చూసి ఐడియా అదిరిపోయిందంటూ చర్చించుకుంటున్నారు. ఏదైమైనా ఈ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# స్పీడ్ పెంచిన కాంగ్రెస్.. మున్సిపల్ ఎన్నికలకు ఇన్‌చార్జ్‌ల ప్రకటన

| పార్లమెంట్ నియోజకవర్గం | - | ఇన్‌చార్జ్ పేరు |
|---|---|---|
| ఆదిలాబాద్ | - | సుదర్శన్ రెడ్డి |
| నిజామాబాద్ | - | ఉత్తమ్‌కుమార్ రెడ్డి |
| మల్కాజ్‌గిరి | - | కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి |
| చేవెళ్ల | - | శ్రీధర్‌బాబు |
| కరీంనగర్ | - | తుమ్మల నాగేశ్వరరావు |
| నల్గొండ | - | అడ్లూరి లక్ష్మణ్ |
| భువనగిరి | - | సీతక్క |
| వరంగల్ | - | పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి |
| మహబూబ్‌నగర్ | - | పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ |
| జహీరాబాద్ | - | అజహరుద్దీన్ |
| ఖమ్మం | - | కొండా సురేఖ |

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. మేడారం వేదికగా జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన అనంతరం, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల వ్యూహకర్తలుగా మంత్రులను నియమించారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పార్టీ విజయం కోసం సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయిలో ప్రచారం వరకు వీరు పర్యవేక్షించనున్నారు.

ఈ నియామకాల్లో భాగంగా ఆదిలాబాద్‌కు సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్‌కు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మల్కాజ్‌గిరికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చేవెళ్లకు శ్రీధర్‌బాబులను ఇన్‌చార్జ్‌లుగా ప్రకటించారు. అలాగే కరీంనగర్ బాధ్యతలను తుమ్మల నాగేశ్వరరావుకు, వరంగల్‌ను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, ఖమ్మం బాధ్యతలను కొండా సురేఖకు అప్పగించారు. ఈ భారీ కసరత్తుతో మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటి, పట్టణ ప్రాంతాల్లో పట్టు సాధించాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. కాగా మరో మూడు రోజుల్లో ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది.

# కొత్త ఏడాదిలో స్క్రబ్ టైఫస్ కేసుల ఆందోళన

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): ఆంధ్రప్రదేశ్‌లో స్క్రబ్ టైఫస్ వ్యాధి తీవ్రత పెరుగుతుండటం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కొత్త ఏడాది (2026) ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 144 మందికి ఈ వ్యాధి సోకినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ముఖ్యంగా పచ్చిక బయళ్ళు, పొలాలు, పొదల్లో ఉండే 'చిగ్గర్ మైట్స్' అనే సూక్ష్మ కీటకాలు కుట్టడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతోంది. ఈ ఏడాది నమోదైన 144 కేసుల్లో ఇప్పటికే నలుగురు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మరణించిన వారిలో అనకాపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు ఉండగా, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. వైద్యారోగ్య శాఖ గణాంకాల ప్రకారం గత కొన్ని రోజులుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఈ జ్వరాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో ప్రభుత్వం అప్రమత్తమై ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది.

స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రధానంగా 'ఒరియెంటియా సూసుగముషి' అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఈ కీటకం కుట్టిన చోట నల్లటి మచ్చ ఏర్పడటం ఈ వ్యాధి ప్రధాన లక్షణం. దీనితో పాటు తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో గుర్తించి చికిత్స అందించకపోతే ఇది ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, మెదడుపై ప్రభావం చూపి ప్రాణాంతకంగా మారుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పొలాల్లో పనిచేసే వారు, గడ్డి ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లే వారు తప్పనిసరిగా ఒళ్లంతా కప్పేలా దుస్తులు ధరించాలని చెబుతున్నారు. అదే విధంగా కాళ్ళకు బూట్లు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఎలిసా పరీక్షలు చేయించుకోవాలని కోరుతున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఈ వ్యాధిని అరికట్టవచ్చని ఆరోగ్య శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# కల్వకుంట్ల కవిత పార్టీ కోసం రంగంలోకి ప్రశాంత్ కిషోర్?



న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): గులాబీ బాస్ కల్వకుంట్ల చంద్రశేఖర రావు కూతురు కవిత కొత్త పార్టీ పెట్టే దిశగా అడుగులు వేస్తున్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు ఇప్పటికే ఆమె హింట్ కూడా ఇచ్చారు. గులాబీ పార్టీ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత.. ట్రబుల్ షూటర్ హరీష్ రావును టార్గెట్ చేస్తూ హాట్ కామెంట్స్ చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే, ఇటు గులాబీ పార్టీలో ఉన్న లుకలుకలను బయట పెడుతున్నారు. అటు బీసీల నినాదం ఎత్తుకుని ముందుకు వెళుతున్నారు. ఇక ఇప్పుడు కొత్త పార్టీ వైపు కవిత అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

కవిత పార్టీ కోసం రంగంలోకి ప్రశాంత్ కిషోర్?: అయితే కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేయబోయే పార్టీ కోసం పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిషోర్ రంగంలోకి దిగినట్లు కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే వైసీపీ లాంటి ప్రాంతీయ పార్టీలకు పని చేసిన ప్రశాంత్ కిషోర్.. నెక్ట్స్ కవిత కోసం పనిచేయబోతున్నారట. రెండు నెలల వ్యవధిలోనే కల్వకుంట్ల కవితను హైదరాబాద్ కు వచ్చి పలుమార్లు రహస్యంగా సమావేశం అయ్యారట ప్రశాంత్ కిషోర్. హైదరాబాద్ లోని ఓ ప్రముఖ హోటల్ లో వీళ్ళ సమావేశం జరిగినట్లు కూడా ఓ న్యూస్ బయటకు వచ్చింది. లేటెస్ట్ గా సంక్రాంతి పండుగ సందర్భంగా ఐదు రోజులపాటు ప్రశాంత్ కిషోర్ తో కల్వకుంట్ల కవిత సమావేశం కూడా నిర్వహించారట.

కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుంది? పార్టీ ఏర్పాటు చేశాక ఎలా ముందుకు వెళ్లాలి ? ఎలాంటి స్ట్రాటజీతో పార్టీని డెవలప్ చేయాలి అనే అంశాలపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. ప్రజల కోణంలో పార్టీ విధానాల రూపకల్పన కోసం ఇప్పటికే 50 కమిటీలను కవిత ఏర్పాటు చేశారట. ఇక ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ సహాయంతో పార్టీని కూడా లాంచ్ చేయబోతున్నట్లు సమాచారం. మరి ప్రశాంత్ కిషోర్ సలహాలు కవిత పార్టీకి ఏ మేరకు కలిసి వస్తాయో చూడాలి. అటు తమిళనాడు రాష్ట్రంలో దళపతి విజయ్ పార్టీకి ప్రశాంత్ కిషోర్ సలహాదారులుగా ఉన్నారు.

# తమ్ముడి ప్రాణం కాపాడిన ఎనిమిదేళ్ల చిన్నారి

న్యూస్ డెస్క్, 19 జనవరి (ఇది కద నిజం ): రాష్ట్రంలో షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఏపీలోని అనంతపురం జిల్లా ఉరవకొండలో ఎనిమిదేళ్ల బాలుడు లింగేష్ తన సమయస్ఫూర్తితో తమ్ముడి ప్రాణాన్ని కాపాడాడు. వివరాల్లోకి వెళితే.. కుళాయిల మరమ్మతుల కోసం 15 రోజుల క్రితం వారి ఇంటి ముందు అధికారులు 8 అడుగుల లోతు గుంత తవ్వి పూడ్చకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆ గుంతలో నీరు ఉంది. ఈ క్రమంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో పిల్లలిద్దరు ఇంటి ముందు ఆడుకుంటున్నారు. ఈ తరుణంలో ప్రణీత్ అనుకోకుండా గుంతలో పడిపోయాడు.

నీటిలో మునుగుతున్న తమ్ముడిని చూసి అన్న లింగేష్ భయాందోళనకు గురై.. వెంటనే అతని చేయి పట్టుకొని గట్టిగా అరిచాడు. అమ్మా.. నాన్న అంటూ కేకలు వేశాడు. పిల్లల తల్లిదండ్రులు(అనిత, ముఖేష్)వెంటనే బయటకు వచ్చారు. పిల్లలను చూసి ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో బాలుడిని బయటకు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. బాలుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. అయితే.. ప్రమాదకరంగా మారిన ఆ గుంతను పూడ్చకుండా వదిలేయడం పై అధికారుల తీరు పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పైలెట్ రోహిత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు




ఇది కద నిజం, తాండూరు: తాండూరు నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి సమక్షంలో తాండూరు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పరిమళ, సీనియర్ నాయకులు రవీందర్ తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తాండూరు ఎంపీటీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణతో పాటు 13 మరియు 15వ వార్డులకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులకు రోహిత్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఓడిపోయే మున్సిపాలిటీలలో తాండూరు మొదటి స్థానంలో ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే తలకిందులుగా తపస్సు చేసినా తాండూరు మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చే దొంగ హామీలను, నకిలీ గ్యారంటీలను నమ్మి ప్రజలు మోసపోయారని, ఇప్పుడు వాస్తవాలను గ్రహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సొంతంగా అభ్యర్థులు దొరకక తన అనుచరులను కాంగ్రెస్ పార్టీ అడుక్కుంటోందని రోహిత్ రెడ్డి ఎద్దేవా చేశారు. “మనోహర్ రెడ్డిని నమ్మకండి, ఆయన వాడుకుని వదిలేస్తారు“ అంటూ కాంగ్రెస్ శ్రేణులను హెచ్చరించారు. గతంలో శ్రీనివాస్ రెడ్డి భిక్షతోనే మనోహర్ రెడ్డి ఎమ్మెల్యే అయ్యారని గుర్తు చేస్తూ.. తాండూరులో కాంగ్రెస్ పార్టీని సమాధి చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. తాండూరు అభివృద్ధికి మంజూరైన రూ.18 కోట్ల యూఐడీఎఫ్ నిధులపై ఆయన క్లారిటీ ఇచ్చారు. అందులో రూ.15 కోట్లు జాతీయ హౌసింగ్ బ్యాంక్ ద్వారా తీసుకున్న రుణం అని, దీనిని తాండూరు మున్సిపాలిటీ తిరిగి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది కేవలం రూ.3 కోట్లు మాత్రమేనని, ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజు గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ కోట్రికే విజయలక్ష్మి, సీనియర్ నాయకులు సాయిపూర్ నర్సింలు, శ్రీనివాస్ చారి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శోభారాణి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, వార్డ్ ఇంచార్జీ సందీప్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ లు మంఖాల రాఘవేందర్, వరాల శ్రీనివాస్ రెడ్డి, సంగీత ఠాకూర్, అనురాధ, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి సలీం, నాయకులు బషారత్, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి లో సర్పంచ్ ల పాత్ర కీలకం

## యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు




ఇది కద నిజం :సోమవారం పోచంపల్లి మండలం జలల్ పూర్ లోని స్వామి రామానంద తీర్థ ఇన్స్టిట్యూట్ లో కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లకి గ్రామ పంచాయతీ పాలన, విధులు,అభివృద్ధి కి సంబందించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హనుమంత రావు, స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ కిషోర్ రెడ్డి, డైరెక్టర్ విహారి, జడ్పీ సి ఈ ఓ శోభా రాణి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, యమ్. ఆర్. ఓ శ్రీనివాస్ రెడ్డి తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ గ్రామాలలో అన్ని రకాలుగా అభివృద్ధి జరగాలి అంటే సర్పంచ్ లు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు.సర్పంచ్ లు బాగా పని చేస్తేనే వారి గ్రామాలకు మంచి పేరు వస్తుందన్నారు.పంచాయతీ రాజ్ చట్టం లో సర్పంచ్ లకు పొందు పరిచిన అధికారాలు, విధులు తదితర అంశాల ను శిక్షణ లో భాగం గా క్షుణ్ణం గా అవగాహన

చేసుకోవాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ, త్రాగు నీటి ఎద్దడి లేకుండా చూడడం లాంటి ప్రధాన అంశాల్లో సర్పంచ్ లు చురుకుగా పని చేయాలిసిన అవసరం ఉంటుందన్నారు.

ప్రతీ గ్రామం శుభ్రం గా ఉంచాలన్నారు.పంచాయతీ రాజ్ చట్టం లోని గ్రామ పాలన విధులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి పథకాలు, ఆదర్శ గ్రామపంచాయతీ ల నిర్మాణం తదితర అంశాలపై సర్పంచ్‌ల బాధ్యతలపై అవగాహన కల్పించడం జరుగుతుందని,

పంచాయతీ రాజ్ చట్టం లోని ప్రతీ అంశాన్ని సర్పంచ్ లు అవగాహన కలిగి ఉండాలన్నారు.కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, మోరల్ స్కిల్స్, తదితర అంశాల పైన కూడా సర్పంచ్ లకు అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో యం పి డి ఓ లు, డివిజనల్ పంచాయతీ అధికారులు, యం పి ఓ లు, నూతన సర్పంచ్ లు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ - జేఏసీ సమీక్షా సమావేశం



ఇది కద నిజం,హైదరాబాద్: నగరంలో విశారధన్ మహరాజ్ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సమీక్షా సమావేశం అత్యంత ఉత్సాహంగా జరిగింది. అణగారిన వర్గాల హక్కులు మరియు భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర కన్వీనర్ తోట్ల రాఘవేందర్ ముదిరాజ్ మరియు కార్యదర్శి బాలయ్య ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బహుజన వర్గాల ఐక్యత ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, జేఏసీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ - జేఏసీ కన్వీనర్ వడ్ల శేఖర్ చారి, జిల్లా ఉపాధ్యక్షులు రజినీకాంత్ యాదవ్ కూడా పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో జేఏసీని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం నింపుతామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమావేశం చివరలో అందరూ “జై భీమ్“ నినాదాలతో తమ ఐక్యతను చాటారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్యం అందాలి

## జిల్లా కలెక్టర్ హనుమంతరావు




ఇది కద నిజం:సోమవారం భూదాన్ పోచంపల్లి కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయానికి వస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు.ప్రతి రోజు ఇన్ పేషెంట్ , ఔట్ పేషంట్ ఎంతమంది పేషంట్లు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలు చెకప్ కు ఎంతమంది వస్తున్నారని అడిగి తెలుసుకొని గర్భిణీ స్త్రీ తో కలెక్టర్ స్వయంగా ఫోన్ లో మాట్లాడి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసున్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి డబ్బును వృథా ఖర్చు చేయరాదన్నారు. ప్రతి నెల ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

## : అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



ఇది కద నిజం: సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కర్ రావు వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 29 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 20, పంచాయతీ శాఖ 3, గ్రామీణాభివృద్ధి శాఖ 2, ఎస్సీ వెల్ఫేర్,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,మున్సిపాలిటీ, లేబర్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జయమ్మ, ఆర్డీవో కృష్ణారెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి



ఇది కద నిజం: సోమవారం పోచంపల్లి మున్సిపాలిటీ లో జరుగబోయే మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోచంపల్లి మున్సిపాలిటీలో ఎన్ని వార్డులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. వార్డుల వారీగా ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని పరిశీలించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు అన్ని ఉన్నాయా లేవా అని చూసుకోవాలన్నారు. మున్సిపల్ ఎన్నికలకు అధికారులు, సిబ్బంది అందరూ సిద్ధంగా ఉండాలన్నారు . మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనల పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు.ఎన్నికల విధులను సంబంధిత అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల మాదిరిగానే మున్సిపాలిటీ ఎన్నికలను కూడా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే టీఆర్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



ఇది కద నిజం, పరిగి : నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా సాగుతున్న చేరికల్లో భాగంగా, పరిగి మండలం యాబాజిగూడ సర్పంచ్ కంకరి యాదమ్మ నరసింహులు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సర్పంచ్‌తో పాటు ఆ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పరిగి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ అభివృద్ధి ప్రస్థానంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పని చేస్తూ గ్రామాల పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచ్ కంకరి యాదమ్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తాము నమ్ముతున్నామని, ఎమ్మెల్యే టీఆర్ఆర్ సహకారంతో యాబాజిగూడను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటామని ఆమె ఈ సందర్భంగా వెల్లడించారు.

# హైదరాబాద్‌లోని టి-హబ్‌లో బీహార్ డెవలప్‌మెంట్ సమ్మిట్ 2026



ఇది కద నిజం,హైదరాబాద్: లెట్స్ ఇన్‌స్పైర్ బీహార్ (LIB) ఉద్యమం టి-హబ్‌లో నిర్వహించిన బీహార్ డెవలప్‌మెంట్ సమ్మిట్ 2026 ఈరోజు విజయవంతంగా ముగిసింది, 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారే ప్రయాణంలో భాగంగా బీహార్ యొక్క సమ్మిళిత వృద్ధి మరియు వ్యవస్థాపకత దార్శనికతను బలోపేతం చేసింది.

జనవరి 18న హైదరాబాద్‌లోని ప్రధాన ఆవిష్కరణ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమం, బెంగళూరులో ఇటీవల ముగిసిన బీహార్ ఏ 2047 విజన్ కాన్‌క్లేవ్ (సీజన్ 3) నుండి ఊపందుకుంది. బీహార్‌లోని అభివృద్ధి చెందుతున్న రంగాలలో అవకాశాలతో దక్షిణ భారతదేశం మరియు అంతకు మించి ఉన్న విధాన నిర్ణేతలు, పెట్టుబడిదారులు, వ్యవస్థాపకులు మరియు నిపుణులను అనుసంధానించడానికి ఇది కీలక వేదికగా పనిచేసింది. బీహార్ ప్రభుత్వ ఇన్‌స్పెక్టర్ జనరల్, సీనియర్ IPS అధికారి వికాస్ వైభవ్ స్థాపించిన LIB ఉద్యమం ఒక ప్రధాన నిబద్ధతతో నడుస్తుంది: నాణ్యమైన విద్య, ఉపాధి లేదా ఆరోగ్య సంరక్షణ కోసం ఏ బిహారీ పౌరుడు కూడా వలస వెళ్లాల్సిన అవసరం లేదని నిర్ధారించడం. విద్య, సమానత్వం మరియు వ్యవస్థాపకతలో పాతుకుపోయిన ఇది, బీహార్ యొక్క గొప్ప నాగరికత, మేధో మరియు వ్యవస్థాపక వారసత్వం నుండి ప్రేరణ పొందుతుంది, అదే సమయంలో కులం, మతం, లింగం మరియు భావజాల విభజనలను అధిగమిస్తుంది.

ప్రాంతీయ ప్రయత్నంగా దాని మూలాల నుండి, LIB దేశవ్యాప్తంగా మరియు ప్రపంచవ్యాప్త ఉద్యమంగా అభివృద్ధి చెందింది, భారతదేశం మరియు విదేశాలలో మూడు లక్షలకు పైగా వ్యక్తులను ఏకం చేసింది – 20,000 కంటే ఎక్కువ మంది వ్యవస్థాపకులు మరియు సీనియర్ నిపుణులు – బహుళ రాష్ట్రాలు మరియు దేశాలలో క్రియాశీల అధ్యాయాల ద్వారా. ఈ నెట్‌వర్క్ బీహార్ కోసం స్థిరమైన అభివృద్ధి పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి మేధో మూలధనం, వృత్తిపరమైన నైపుణ్యం మరియు వ్యవస్థాపక శక్తిని సమీకరిస్తుంది.

స్టార్టప్‌లు, MSMEలు, నైపుణ్య అభివృద్ధి మరియు ఆవిష్కరణ-నేతృత్వంలోని వృద్ధిపై దృష్టి సారించిన చర్చలతో, విధాన చట్రాలు, పెట్టుబడి ఆసక్తి మరియు అట్టడుగు వర్గాల ఆకాంక్షల మధ్య ఆచరణాత్మక సంబంధాలను ఏర్పరచడాన్ని శిఖరాగ్ర సమావేశం నొక్కి చెప్పింది. బీహార్‌ను ఎంటర్‌ప్రైజ్ మరియు పెట్టుబడికి ఆకర్షణీయమైన గమ్యస్థానంగా ఉంచడానికి పాల్గొనేవారు గ్రామీణ పునరుజ్జీవనం, పట్టణ ఆవిష్కరణ మరియు ప్రాంతీయ సహకారాల కోసం కార్యాచరణ నమూనాలను అన్వేషించారు. “ఈ వేదికగా హైదరాబాద్ ఎంపిక వ్యూహాత్మకమైనది, భారతదేశంలోని ప్రముఖ స్టార్ట్-అప్ మరియు ఇన్నోవేషన్ హబ్‌లలో ఒకటిగా దాని హోదాను ఉపయోగించుకుని, దక్షిణ ప్రాంతం మరియు మరిన్ని ప్రాంతాల నుండి ప్రతిభ, పెట్టుబడిదారులు మరియు వ్యవస్థాపకులను ఆకర్షించడానికి మరియు సినర్జీలను ప్రేరేపించడానికి ఉపయోగించుకుంటుంది“ అని వికాస్ వైభవ్ అన్నారు.

ప్రముఖ హాజరైన వారిలో VIP హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ న్యాయవాది మరియు వ్యవస్థాపకుడు మున్నా మరియు రాయల్ ఇండియా హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ షేక్ అహ్మద్, IT డెవలపర్ & డైరెక్టర్ స్కంద డెవలపర్స్ నాగరాజ్ ఉన్నారు. వారి భాగస్వామ్యం సమ్మిట్ యొక్క విస్తృత ఆకర్షణను నొక్కి చెప్పింది, మానవ హక్కుల వాదన మరియు రియల్ ఎస్టేట్ వ్యవస్థాపకత నుండి దృక్కోణాలను బీహార్ యొక్క సమగ్ర అభివృద్ధిపై చర్చకు తీసుకువచ్చింది.


హైదరాబాద్ శిఖరాగ్ర సమావేశం జాతీయ కార్యక్రమాల శ్రేణిలో భాగం, తదుపరి ప్రధాన సమావేశం ఫిబ్రవరి 22, 2026న న్యూఢిల్లీలోని టాల్కటోరా స్టేడియంలో జరగనుంది. LIB తన అడుగుజాడలను విస్తరిస్తూనే, 2047 నాటికి విక్సిత్ భారత్‌లో విలీనం చేయబడిన స్వావలంబన, సంపన్న బీహార్ వైపు సమిష్టి చర్యను ప్రేరేపించడంలో ఈ ఉద్యమం తన పాత్రను పునరుద్ఘాటిస్తుంది.

# సేవే పరమావధిగా జీవించిన మహనీయుడు డాక్టర్ మాధవ రెడ్డి



ఇది కద నిజం :వనపర్తి లో డాక్టర్ జిల్లెల్ల మాధవ రెడ్డి స్మారక ఫుట్ బాల్ టోర్నమెంట్ ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు.ఆయన వర్ధంతి సందర్బంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ డాక్టర్ గా మాధవ రెడ్డి జీవితం ఆదర్శనీయమని అన్నారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ గా ఉండి కూడా ఆయన సాధారణమైన జీవనం గడిపారని తెలిపారు. సేవే పరమావదిగా మాధవ రెడ్డి చేరిన సేవలు చిరస్మరనీయమన్నారు. ప్రతీ అదివారం బస్సు లోనే ప్రయాణం చేసి వనపర్తి కి వచ్చి రోగులకు వైద్య పరీక్షలు చేసిన గొప్ప మహానుభావుడు మాధవ రెడ్డని కొనియాడారు. ఆయన మరణం వల్ల వనపర్తి చాలా కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ ఉద్యమంలో కూడా మాధవ రెడ్డి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. మనం బ్రతికినన్ని రోజులు ఎలా బ్రతికామన్నది కాకుండా ఎంత గొప్పగా బ్రతికామన్నదే ముఖ్యమన్నారు.మా అమ్మ కూడా మక్తల్ లో నర్స్ గా నిస్వార్థంగా చాలా సేవ చేసెదని, ఆ సేవ తోనే తన అమ్మ కు ప్రజల్లో మంచి గుర్తింపు ఉందని తెలిపారు. మా అమ్మా పేరు చెడి పోకుండా తాను కూడా ప్రజలకు సేవ చేస్తున్నానని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా చిన్నారెడ్డి గారు కూడా తన అన్న మాధవ రెడ్డి పేరు నిలబెట్టాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు వనపర్తి ఎమ్మెల్యే మెఘా రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



ఇది కద నిజం:యాదగిరిగుట్ట మండలంలోని పలువురి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు.కొత్తగా పెళ్లయిన ప్రతి అర్హత కలిగిన మహిళకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని,ఈ పథకం వల్ల వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని అన్నారు.

# రోడ్డు ప్రమాదాలతో రెండు కుటుంబాలు ఛిన్నాభిన్నం

## ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమంలో బాలానగర్ డీసీపీ రితీరాజ్



ఇది కద నిజం:రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా, ప్రజల్లో అవగాహన పెంచేందుకు బాలానగర్ పోలీసులు వినూత్న అవగాహనా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం హెచ్‌ఏఎల్ (HAL) కమ్యూనిటీ హాల్‌లో బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ రాజు ఆధ్వర్యంలో “అరైవ్ అలైవ్“ (Arrive Alive) రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రైట్ కాన్సెప్ట్ హైస్కూల్ యాజమాన్యం సహకారంతో ఈ కార్యక్రమంలో వాహనదారులకు డీసీపీ రితీరాజ్ హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా, రోడ్డు ప్రమాద బాధితుల కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేయడం అందరినీ ఆలోచింపజేసింది. ప్రమాద బాధితురాలు వందన మాట్లాడుతూ.. తన సోదరుడు హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగిన ప్రమాదం తమ కుటుంబాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేసిందో వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఒక చిన్న అజాగ్రత్త రెండు కుటుంబాల భవిష్యత్తును అంధకారం చేస్తుందని, ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆమె కోరారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలానగర్ డీసీపీ రితీరాజ్ (IPS) మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల రహిత సమాజ స్థాపనే ‘అరైవ్ అలైవ్’ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఏటా సుమారు 3,000 ప్రమాదాలు జరుగుతుండగా, దాదాపు 300 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం (Drink & Drive), రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ప్రాణాలు తీస్తున్నాయని ఆమె స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఉపేక్షించేది లేదని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

“పోలీసుల లక్ష్యం జరిమానాలు విధించడం కాదు, ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరుకోవాలన్నదే మా తపన. ఈ ‘అరైవ్ అలైవ్’ సందేశం ప్రతి ఇంటికీ చేరాలి.“ రితీరాజ్, డీసీపీ, బాలానగర్. ఈ సదస్సులో కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏడీసీపీ వీరన్న, ట్రాఫిక్ ఏసీపీ గిరి ప్రసాద్, లా అండ్ ఆర్డర్ ఏసీపీ నరేష్ రెడ్డి, కూకట్‌పల్లి ఎంవీఐ శ్రీను బాబు, ఆర్టీసీ డిపో మేనేజర్ హరినాథ్, బాలానగర్ ఆర్ఐ నాగమణి, స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామ పాలనకు రామరాజ్య దిశగా అడుగులు

## న్యాయంపారదర్శకతతో సర్పంచులే అభివృద్ధి శిల్పులు



గీసుగొండ, 19 జనవరి (ఇది కద నిజం ): గ్రామాల సర్వతోముఖాభివృద్ధిలో సర్పంచులే కీలక భూమిక పోషించాలనీ, వారు శ్రీరాముని ఆదర్శంగా తీసుకుని న్యాయం, నిజాయితీ, పారదర్శకతతో పాలన సాగించాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. గీసుగొండ మండలం గంగదేవిపల్లిలో 11 మండలాల సర్పంచుల కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం సర్పంచులకు కల్పించిన అధికారాలు, బాధ్యతలపై పూర్తి అవగాహనతో పనిచేస్తేనే గ్రామాల్లో ఆశించిన మార్పు సాధ్యమవుతుందన్నారు. పాలనలో పారదర్శకత పాటిస్తూ ప్రజలతో నేరుగా మమేకమవడం ద్వారా గ్రామ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని పేర్కొన్నారు. గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని, అధికారాలను హక్కులుగా కాక బాధ్యతలుగా భావించి పనిచేస్తే గ్రామాలు ఆదర్శంగా నిలుస్తాయని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలప్రదం కావాలంటే స్థానిక నాయకత్వం అంకితభావంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచులు సమన్వయంతో పనిచేస్తే గ్రామ పాలనలో స్పష్టమైన, సానుకూల మార్పు కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ మండలాలకు చెందిన సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రథం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బయ్యారం గర్ల్స్ హై స్కూల్ లో ఉచితంగా కంప్యూటర్ అంద జేత



బయ్యారం, 19 జనవరి (ఇది కద నిజం ): మహబూబాబాద్ జిల్లాలోని కొన్ని పాఠశాలలు ఎంపిక చేసుకొని వివిధ సృజనాత్మకత లో భాగంగా జిల్లా కో ఆర్డినేటర్ స్రవంతి మాట్లాడుతూ సైన్సు ఎన్విరాన్మెంట్ పెయింటింగ్ డ్రాయింగ్స్ లో చక్కటి ప్రతిభ కనబర్చిన బయ్యారం గర్ల్స్ హై స్కూల్ పిల్లలు ఎంపికైనందున, పిల్లలకు అవసరం నిమిత్తం ఇవ్వడం జరిగింది, విద్యార్థులకు వివిధ రంగాల్లో ముందుకు రానివ్వాలని ఉద్దేశంతో పలు రకాల ఆక్టివిటీలు నేర్చుకుంటారని వాళ్లు సంస్థ వాళ్లు క్రియేటివ్ క్లబ్ కోఆర్డినేటర్ తాటి మల్లయ్య ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు మా విద్యార్థుల కోసం కృషి చేస్తున్నందుకు స్రవంతి ని అలాగే మల్లయ్య కి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులు,విద్యార్థిని పాల్గొన్నారు.